కంకోల్‌లో ఉదయం ఎనిమిది గంటలకు మద్యం తాగి రోడ్డుపై పడుకున్న వ్యక్తి

మద్యం మత్తు.. యువత చిత్తు

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- వాడవాడలా బెల్ట్ షాపులు

మునిపల్లి, జూలై 14: 'కిరాణా షాపుల్లో మందు సీసాలు అమ్మితే కేసులు అయితయ్.. జైలుకు పోతరు అంటిరి కదక్కా.. గ్రామంలో గిన్ని దుకాణ్లల బెల్ట్ షాపులు ఉన్నయ్.. ఒక్కరిమీద కేసు పెట్టలేదు.. మందు అమ్ముడు ఆపలేదు.. గీ పిలగాడు చూడు పొద్దుపొద్దుగాల్నే మస్తుగ తాగి ఇంట్ల పన్నట్లు రోడ్డుమీద పండుకొని ఆగం చేస్తుండూ.. ' అంటూ అటుగా వెళ్లే అమ్మలక్కలు అనుకుంటుండ్రు.. ఈ ఘటన ఎక్కడ జరిగిందంటే మండలంలోని కంకోల్‌లో..

అధికారుల తీరుపై అనుమానాలు!

కాంగ్రెస్ ఎన్నికల ముందు గ్రామాల్లో మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తకపోవడంపై మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని బుధేరా, మునిపల్లి చౌరస్తా, తాటిపల్లి గ్రామాల్లోని వైన్స్‌ల నుంచి కిరాణా షాపుల యజమానులు మందు బాటిళ్లను తీసుకువచ్చి పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరుపుతున్నా ఎక్సైజ్ అధికారుల పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలనీకి దివంగత నేత నామకరణం

నాగధర్‌లో బోర్డును ఏర్పాటు చేస్తున్న నాయకులు

కల్హేర్, జూలై 14: నూతనంగా ఏర్పాటు చేస్తున్న కాలనీకి దివంగత నేత మహారెడ్డి వెంకట్‌రెడ్డి కాలనీగా నామకరణం చేసి బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివంగత నేత తనయుడు మహారెడ్డి ధరంపాల్ రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు రోషన్‌రెడ్డి మాట్లాడుతూ నాగధర్ గ్రామంలోని కాలనీకి దివంగత నేత పేరు పెట్టడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చాకలి అడివప్ప, మైపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శావల్లసాయిలు, శ్రీశైలం, సాయిలు, అశోక్, విఠల్, శ్రీను, గంగారాం, మల్లయ్య, రాములు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు

హత్నూర, జూలై 14: నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సుభాష్ హెచ్చరించారు. ఆదివారం దౌల్తాబాద్ బస్టాండ్‌లోని పాన్‌షాప్‌లో దేవులపల్లి గ్రామానికి చెందిన మన్నె పండరి నిషేధిత గుట్కా, తంబాకు విక్రయిస్తుండటంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గుట్కా, తంబాకు విలువ రూ.30వేల వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే 100 లేదా పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్లు 87126 61845, 87126 56752కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

బోనాలు ఘనంగా నిర్వహిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 14: పటాన్‌చెరులో ఈ నెల 29న బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రీకోదండ సీతారామ స్వామి ఆలయంలో బోనాల పండుగ తేదీ నిర్ణయంపై పురప్రముఖుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా 29న బోనాలు నిర్వహించాలని నిర్ణయించారు. పటాన్‌చెరు పట్టణంలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. బోనాల పండుగను ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ అమలు చేస్తామన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరంచ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, జూలై 14: బోరంచ నల్ల పోచమ్మ ఆలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ సంజీవరెడ్డి ఆదివారం పత్యేక పూజలు చేశారు. మనూరు మండల పరిధిలోని బోరంచ నల్ల పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డికి పూజరులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట పూజరులు నగేశ్ స్వామి, సిద్దు స్వామి, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



రాయికోడ్‌లో పోతురాజుల విన్యాసాలు, నెత్తిన బోనాలతో మహిళలు

రాయికోడ్, జూలై 14: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో మండల కేంద్రమైన రాయికోడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామ పుర వీధుల గుండా ర్యాలీగా వెళ్లి అమ్మవారికి గౌడ సంఘం సభ్యులు తొలి బోనం నెత్తిన తీసుకువచ్చి సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి వేడుకున్నారు. గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

అడవి పందులతో పరేషాన్

- పంటలను నాశనం చేస్తున్న అటవీ జంతువులు
- పంటలను రక్షించుకునేందుకు రైతుల అగచాట్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- చర్యలు చేపట్టాలని వేడుకోలు



న్యాల్‌కల్‌లో పంటను కాపాడుకునేందుకు చేను చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్

అడవి పందులు నాశనం చేసిన పంట

న్యాల్‌కల్, జూలై 14: అడవి పందులు పంట పొలాలపై దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలు అడవి జంతువులకు ఆహారంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అడవి పందుల దాడి నుంచి పంటలను ఎలా కాపాడుకుకోవాలలో తెలియక హైరానా పడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన పంటలను అడవి పందులు నాశనం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

పంట రక్షణకు పడరాని పాట్లు

మండలంలోని హద్నూర్, గుంజోట్టి, రాంతీర్థం, రేజింతల్, ఖలీల్‌పూర్, మామిడ్గి, చాల్కి, చీకుర్తి, అమీరాబాద్, రాఘవపూర్ తదితర గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో చెరుకు, పత్తి, కంది, మినుము, పెసర, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. అడవి పందులు గుంపులుగా ఆవాసం ఏర్పాటు చేసుకొని రేయింబవళ్లు ధ్వంసం చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు రాత్రుల్లో పొలాల వద్ద జాగారం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేను చుట్టూ పాత చీరలు

పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ రంగురంగుల పాత చీరలను కట్టడం వల్ల పందులు రావడం లేదని, అయితే ఆ చీరలు కొనడానికి ఖర్చు కూడా ఎక్కువ అవుతుండడంతో ఎక్కువ మంది రైతులు అవి ఏర్పాటు చేయడం లేదు. ఒక ఎకరం అంటే ఎలాగో చీరలను కట్టవచ్చని, నాలుగైదు ఎకరాల్లో చీరలు కట్టాలంటే సాధ్యం కాదని చెబుతున్నారు. పందులు రాకుండా కటింగ్‌షాపులో వెంట్రుకలను పొలం చుట్టూ చల్లుతున్నామని, రేకు డబ్బాలతో చప్పుడు చేస్తూ, పంట చుట్టూ వైర్లను బిగించినా పంటలను పందులు పాడు చేస్తున్నాయని వాపోతున్నారు.

ఆగం చేస్తున్న అడవి పందులు

పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్ని చర్యలు చేపట్టినా వాటిని నియంత్రించలేక పలు చోట్ల పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. దీంతో రైతులు, కూలీలు, పశువులు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్న ఘటనలు ఉన్నాయి. అర్థికంగా ఉన్న రైతులు చేన్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించుకుంటున్నారు. అడవి పందులను పంట పొలాల్లో నుంచి తరమివేసే సమయాల్లో తమపై దాడి చేస్తున్నాయని, దీంతో పంటను కాపాడడాని కన్నా ముందు ప్రాణాలను కాపాడుకోవాల్సి పరిస్థితి వస్తున్నదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. అడవి పందులను చంపితే కేసులు నమోదు అయ్యే అవకాశం ఉండడంతో వాటిని చంపడం లేదని, వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పట్టికైనా అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని అడవి పందులు పంటపొలాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అడవి పందులతో నష్టపోతున్నాం

ఇటీవల పంటపొలాలపై అడవి పందుల దాడి ఎక్కువైంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవడం చాలా కష్టంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటను పందులు నాశనం చేస్తున్నాయి. వ్యవసాయ, అటవీ శాఖాధికారులు తగు చర్యలు తీసుకొని పంటలను ఎలా కాపాడుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలి. అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

- తిరుమల బక్కారెడ్డి, రైతు (హద్నూర్)

సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్

అడవి పందులు పంట పొలాలపై దాడి చేయకుండా రైతులు పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసుకోవాలి. దీని కోసం ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలను అందజేస్తున్నది. రైతులు పొలం చుట్టూ చీరలు కట్టుకోవడం కూడా మంచి పద్ధతే.. పొలం చుట్టూ కటింగ్ షాపులో లభించే వెంట్రుకలను చల్లితే పందుల బెడద నుంచి పంటకు రక్షణ పొందొచ్చు. పందులు వాసన పీల్చడం వల్ల ముక్కులోకి వెంట్రుకలు వెళ్లి ఇబ్బందిగా మారడంతో అక్కడికి రావన్నారు. పొలం చుట్టూ పెన్సింగ్ వేయడంతోనే పందుల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- లావణ్య, ఏపీవో (న్యాల్‌కల్)

కోహీర్‌లో ఆషాఢ బోనాలు

కోహీర్, జూలై 14: కోహీర్ పట్టణంలోని భీమ్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు ఆదివారం ఆషాఢ బోనాలను అమ్మవారికి సమర్పించారు. అందంగా అలంకరించిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో భీమ్‌నగర్ కాలనీ భక్తులు పాల్గొన్నారు.

వానల కోసం పూజలు

హత్నూర, జూలై 14: వానకాలం ప్రారంభమైనా సరైన వర్షాలు కురవకపోవడంతో హత్నూరలో గ్రామస్తులు కట్ట మైసమ్మకు పూజలు చేశారు. మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి వర్షాలు విస్తారంగా కురవాలని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామస్తులు వెంకటేశం గౌడ్, బాలకృష్ణ, ధనుంజయ, లింగం, నర్సింహారెడ్డి, పెంటయ్య, రామె రాములు, మల్లేశం, యాదగిరి, గోపాల్, లింగారెడ్డి, మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో సెక్యూరిటీగార్డు మృతి

కోహీర్, జూలై 14: బూచినెల్లి పారిశ్రామిక వాడలోని మంగ్ల ట్యూబ్ పరిశ్రమకు చెందిన సెక్యూరిటీ గార్డు శివకుమార్(62) గుండెపోటుతో మృతి చెందాడు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శివకుమార్ ఆదివారం విధులు నిర్వహిస్తుండగా గుండె నొప్పి రావడంతో చికిత్స కోసం దవాఖానకు తరలించారు. కానీ, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, మాజీ కౌన్సిలర్ రాములు నేత డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించకుండా కార్మికులతో యాజమాన్యం పని చేయించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మాదారం పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమైన గ్రామస్తులు

క్రషర్, క్వారీలపై పోరాటానికి జేఏసీ

జిన్నారం, జూలై 14: మాదారం గ్రామ పరిధిలోని కంకర క్రషర్లు, క్వారీలను శాశ్వతంగా మూసివేయడమే లక్ష్యంగా మాదారం గ్రామస్తులు కార్యాచరణ చేపట్టారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామస్తులు సమావేశమయ్యారు. మాదారం పోరాట కమిటీ జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న క్రషర్లు, క్వారీలను శాశ్వతంగా మూసివేసేందుకు నిర్వహించే పోరాటానికి జేఏసీని ఏర్పాటు చేసుకున్నామని, కమిటీ ఆధ్వర్యంలో తదుపరి కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మాదారం పోరాట కమిటీ జేఏసీ అధ్యక్షుడిగా ఎస్.విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎల్.ఆరేందర్ గౌడ్, పి.భాస్కర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా టి.రమణసింగ్, అనిల్‌కుమార్, ట్రెజరర్‌గా ఎల్.మహేందర్‌గౌడ్, సీహెచ్ గణేశ్, చీఫ్ అడ్వైజర్‌గా సీహెచ్ మహేశ్, బి.వీరేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా జి.శ్రీనివాస్, కె.నర్సింగ్‌రావు, కె.అంబదాస్, జె.బాలేశ్, పి.బాబు, ఎం.ప్రసాద్, పి.పాండు, కాసాల రాజును గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం, జూలై 14: కుటుంబ కలహాలతో ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(40) క్యాటరింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య మంగాదేవితోపాటు కూతురు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ అప్పుడప్పుడు మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో 10వ తేదీన మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడడంతోపాటు పిల్లలను కొట్టాడు. దీంతో అతడి భార్య మంగాదేవి పిల్లలను తీసుకొని ఓల్డ్ ఆర్సీపురంలోని ఆమె సోదరుడి ఇంటికి వెళ్లింది. భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని మనస్తాపం చెంది 13న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి యజమానికి అనుమానం వచ్చి కిటికీలోంచి చూడడంతో అప్పటికే ఉరి వేసుకొని ఉన్నాడు. వెంటనే అతడి భార్యకు ఫోన్‌లో సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శ్రీనివాస్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శశికాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

నర్సింలు

బొల్లారం, జూలై 14: పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మంబోజిపల్లికి చెందిన నర్సింలు(38) బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన ఉదయం 6 గంటలకు రోజు మాదిరిగా పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య సుశీల పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారంలో మోస్తరు వర్షం

జిన్నారం, జూలై 14: మూడు రోజులుగా మోస్తారు వర్షాలు కురుస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జిన్నారం మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో వరినాట్లు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో నారు పెరగడంతో ఆందోళనలో ఉన్న రైతులకు మూడు రోజులుగా కురిసిన వర్షాలు సంతోషాన్ని ఇచ్చాయి. ఎరువులు, కూలీలను సమకూర్చుకోవడంలో బిజీగా మారారు. కూలి ఎక్కువ అయినా సరే ఈ సమయంలోనే నాట్లు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు.

సమయానికి టిఫిన్ పెట్టడం లేదంటూ ఆందోళన

హత్నూర, జూలై 14: సమయానికి టిఫిన్ పెట్టడంలేదంటూ హత్నూర బాలుర బీసీ హాస్టల్ విద్యార్థులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతోపాటు సమయానికి వంట చేయడంలేదని ఆరోపించారు. బయట మహిళ వంట చేస్తున్నదని, తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. హాస్టల్‌లో సిబ్బంది సైతం సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ బద్రిప్రసాద్‌ను సంప్రదించగా వంట మనిషి రాకపోవడంతో బయట మహిళతో వంట చేయిస్తున్నట్లు తెలిపారు. ఇకముందు పొరపాటు జరగకుండా చూసుకుంటామన్నారు.

కార్మికుల శ్రేయస్సే 'హెచ్ఎంఎస్' లక్ష్యం

తెలంగాణ అధ్యక్షుడు సదానంద్‌గౌడ్

మాట్లాడుతున్న తెలంగాణ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు సదానంద్‌గౌడ్

కోహీర్, జూలై 14: కార్మికుల బాగు కోసం మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి స్థాపించిన హెచ్ఎంఎస్‌ను గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్ కోరారు. మండలంలోని దిగ్వాల్ పిరమాల్ ఫార్మా పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల లాభం కోసం పని చేస్తామన్నారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేస్తామని హామీనిచ్చారు. కార్మికులు రిటైర్మెంట్ అయ్యే సమయంలో ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తామన్నారు. కార్మికుల్లోని అర్హత కలిగిన పిల్లలకు కూడా పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ధర్మచక్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

నేడే పిరామల్ ఫార్మాలో ఎన్నికలు

మండలంలోని దిగ్వాల్ పిరమల్ ఫార్మా పరిశ్రమలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పరిశ్రమలో మొత్తం 137మంది పర్మినెంట్ కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం పరిశ్రమలో మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్థాపించిన హిందుస్థాన్ మజ్దూర్ సంఘం గుర్తింపు సంఘంగా ఉంది. ఎన్నికల్లో హెచ్ఎంఎస్ తరపున నాయిని నర్సింహారెడ్డి అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి, సీఐటీయూ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఎక్టీవ్ యూనియన్ నుంచి ఎం.జీ రాములు ఎన్నికల బరిలో ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ నిర్వహించి తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

హైవేల ఏర్పాటుపై మంత్రులకు వినతి

అందోల్, జూలై 14: అందోల్ నియోజకవర్గం మీదుగా వెళ్లే రెండు రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి వినతిపత్రం అందజేసినట్లు జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్‌గుప్తా తెలిపారు. ఆదివారం బీజేపీ అధికార ప్రతినిధి జన్వాడ సంగప్పతో కలిసి ఇద్దరు మంత్రులను కలిసి వినతిపత్రం అందజేయగా వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 35.5 కిలోమీటర్లు మెదక్-బోడ్మట్‌పల్లి, 44 కిలోమీటర్ల పొడవైన అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ రెండు రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేస్తే అందోల్ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, నారాయణఖేడ్ ప్రాంతాల ప్రజలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలలకు ఉపయోగకరంగా ఉంటుందని మంత్రులకు వివరించినట్లు చెప్పారు. వినతిని సంబంధిత శాఖ మంత్రి నితిన్‌గడ్కారి దృష్టికి తీసుకువెళ్తామని మంత్రులు హామీ ఇచ్చారన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గంగా జోగినాథ్‌గుప్తా

సర్వోదయ ఉత్పత్తులు అద్భుతం



సర్వోదయ ఉత్పత్తులపై మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

ఎస్పీ రూపేశ్

పుల్కల్, జూలై 14: సర్వోదయ ఉత్పత్తులు మహా అద్భుతమని ఎస్పీ రూపేశ్ అన్నారు. మహిళా సాధికారితే లక్ష్యంగా మండల పరిధిలోని గొంగ్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఆదివారం ఎస్పీ సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఐఆర్ఎస్ అధికారుల చొరవతో 150 మంది స్వయం సహాయక మహిళల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సర్వోదయ ఉమెన్ ఇండస్ట్రీస్ కంపెనీలో తయారు చేసే ఉత్పత్తులు చాలా బాగున్నాయని ప్రశంసించారు. సాంప్రదాయబద్ధంగా తయారు చేసే గానుగ నూనెలు, పప్పులు, చిరుధాన్యాలు, చేతితో తయారు చేసిన సబ్బులు, సర్పులు, హౌస్ కీపింగ్ ఇలా ఇంకా ఎన్నో రకాల ప్రొడక్ట్ తయారు చేసి మార్కెటింగ్ చేసే విధానాన్ని ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్ ఎస్పీకి వివరించారు. ఇక్కడి ఉత్పత్తులను పోలీస్ హెడ్ క్వార్టర్‌లోని క్యాంటీన్‌లో విక్రయించేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, పల్లె సంజీవయ్య, పల్లె కిష్టయ్య, గోపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, వీర్మెట్టి, మల్లికార్జున్, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉత్పత్తులను ఎస్పీకి చూపిస్తున్న ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్